క్లుప్తంగా

కంటైనర్ అందజేత



కన్నాయిగూడెం: మండలంలోని ఐలాపూర్ గ్రామంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆధ్వర్యంలో ఈసీఎల్ ద్వారా బహూకరించిన కంటైనర్‌ను ఆరోగ్య ఉపకేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. గోపాలరావుకు అందజేత. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు మినీ–మేడారం జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని సందర్శించి సమ్మక్క–సారలమ్మ దేవతల దర్శనానికి వస్తున్న భక్తుల వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఎం క్రాంతికుమార్, వైద్యాధికారి అభినవ్, ఐటీడీఏ ప్రోగ్రామ్ అధికారి మహేందర్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక

ములుగు రూరల్: తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా గడ్డం రామకృష్ణ, అమ్జద్‌పాషాలను ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మ తెలిపారు. ఈ మేరకు గురువారం జిల్లాకేంద్రంలోని విశ్రాంత భవన్‌లో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బండి నర్సయ్య, సహాయ కార్యదర్శిగా సంతోష్, కోశాధికారిగా జక్కుల అయిలయ్య, సభ్యులుగా శ్రీనివాస్, నాసర్, సారయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

వాజేడు: మండల పరిధిలోని ఆరుగుంటపల్లి గ్రామంలో కొత్తగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ విజయకు వినతిపత్రం అందజేశారు. మొరుమూరు గ్రామ పంచాయతీలో ఉన్న ప్రగళ్లపల్లి పోలింగ్ కేంద్రానికి 8 కిలో మీటర్ల దూరంలో బొల్లారం , ఆరుగుంటపల్లి గ్రామ ఓటర్లు వచ్చి ఓట్లను వేయాలంటే ఇబ్బందికరంగా ఉందన్నారు. ప్రష్టారెడ్డి, డెనార్జున రావు, రఘుపతి రావు, రామ్ కిషోర్, రాంబాబు, మల్లయ్య, రాఘవులు, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

వెదజల్లే పద్ధతితోనే లాభాలు

వాజేడు: వరి పంటను సాగు చేసే రైతులు వెదజల్లె పద్ధతిని పాటిస్తే లాభలు ఉంటాయని మండల వ్యవసాయాధికారి ముంజ మహేశ్ అన్నారు. మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో గురువారం రైతులకు అవగాహన కల్పించారు. వెదజల్లె పద్ధతితో పెట్టుబడి తగ్గుతుందని తెలిపారు. అంతే కాకుండా ఎకరానికి విత్తనాలు 10 కిలోలు మాత్రమే అవసరం అవుతాయన్నారు. వెదజల్లే పద్ధతిలో సాగు చేసే రైతులకు సూడో మోనాస్ అనే జీవ శిలీంద్ర నాశిని, భాస్వరం కరిగించి ఇచ్చే బ్యాక్టీరియాను ఉచితంగా అందించారు. ఆయన వెంట ఏఈఓలు హరీష్, జాఫర్‌తో పాటు తదితరులు ఉన్నారు.



ఏటూరునాగారం: శివసత్తులతో సదాలమ్మ గుడివద్ద సందడి



కొండాయిలో పడిగెతో వస్తున్న గోవిందరాజులు



కొండాయి జాతరకు తరలివస్తున్న భక్తులు

వనంనుంచి జనంలోకి..

కొలువుదీరిన సమ్మక్క

- అమ్మవార్లకు భక్తుల మొక్కులు
- సందడిగా మినీ జాతరలు

కన్నాయిగూడెం: మండలంలోని ఐలాపూర్‌లో నిర్వహిస్తున్న సమ్మక్క–సారలమ్మ జాతర రెండో రోజు గురువారం కొనసాగింది. సమ్మక్క తల్లి గద్దెకు చేరడంతో గద్దెల ప్రాంగణమంత భక్తజనులతో కిక్కిరిసి పోయింది. ప్రధాన పూజారి మల్లెల మధు, పూజారులు కుర్సం చొక్కారావు, కుర్సం రాంబాబు, మల్లెల నరేశ్‌లతో కూడిన బృందం ఉదయం పూజారులు దట్టమైన అటవీలో నుంచి వెదురును భక్తిశ్రద్ధలతో తీసుకొచ్చి సమ్మక్క గద్దెపై ప్రతిష్ఠించారు. వనంను తీసుకొచ్చిన అనంతరం దేవర బాలపై సమ్మక్క పూనకమై దేవర వృక్షంపైకి ఎక్కి భక్తులను దీవించింది. దీంతో భక్తులు ఆర్త నాదాలు చేసి అరుపులతో తల్లిని మొక్కుకున్నారు. ఐలాపూర్‌లో వెలసిన సమ్మక్క దేవర వృక్షం ఎక్కి భక్తులను దీవించడం ఇక్కడా ప్రత్యేకతగా భక్తులు చూస్తారు. మధ్యాహ్నం పూజారులు, మల్లెల వంశస్తులు గ్రామంలో నుంచి ఆడారాలను పూజలు చేసి తీసుకొచ్చి సమ్మక్క గద్దెపై ప్రతిష్ఠించి పూజలు చేశారు. కాగా, ప్రధాన గట్టమైన సమ్మక్క రాకతో జాతరలో చుట్టుపక్కల ప్రాంతమంత భక్తులతో నిండిపోయింది. సమ్మక్కను గద్దెకు చేరడంతో భక్తులు తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్కను దేవర గుట్ట నుంచి తీసుకొస్తున్న క్రమంలో ఎస్సై వెంకటేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బలగాలతో భద్రతను కట్టుదిట్టం చేశారు.

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి గ్రామంలోని సమీప అడవిలో నుంచి కంకవనాన్ని డప్పుచప్పుళ్ల మధ్య గోవిందరాజుల పూజారులు దబ్బగట్ల గోవర్దన్, దబ్బగట్ల రాజారంతోపాటు వడ్డెలు ఆదివాసీ సంప్రదాయంగా గ్రామంలో ఊరేగింపుగా గురువారం తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్ఠించారు. ఉదయం గద్దెలపై వనంను ప్రతిష్ఠించగా సాయంత్రం దేవరగుట్ట నుంచి గోవిందరాజులు, నాగులమ్మను దూపం వేస్తూ గజ్జెల చప్పుడుతో తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్ఠించారు. గోవిందరాజులు, నాగులమ్మ గుట్ట దిగడంతో భక్తులు ఎదురెళ్లి దేవతలకు నీళ్ల ఆరబోసి చల్లంగా చూడని వేడుకున్నారు. దేవతలు వచ్చే దారుల్లో ఉన్న వాగులు, వంకల నీటిని తాకకుండా వడ్డెలను వలంటీర్లు, దబ్బగట్ల కులస్తులు పైకి ఎత్తుకొని నీటిని తాకకుండా దాటించారు. దీంతో కొండాయిలోని గద్దెలపై గోవిందరాజులు, నాగులమ్మ, సారలమ్మ కొలువై ఉండడంతో భక్తులు పెద్ద ఎత్తున చేరుకొని మొక్కులు చెల్లించారు. ఛత్తీస్‌గఢ్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు చేరుకోవడంతో కొండాయి గ్రామం జనసంద్రంగా మారింది.

ఏటూరునాగారంలో సదాలమ్మ జాతర

మండల కేంద్రంలోని ఓడవాడలో సమ్మక్క–సారలమ్మ(సడాలమ్మ) జాతర గురువారం వైభవంగా జరిగింది. గుడి పూజారులు కొండమళ్ల వరలక్ష్మీ, కొండమళ్ల రంగయ్య, కొండమళ్ల అనసూర్యలు డప్పుచప్పుళ్లతో సమీపంలోని అడవికివెళ్లి కంకవనాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి సమ్మక్క గద్దె చుట్టూ మూడు ప్రదక్షిణలుచేసి గద్దెపై ప్రతిష్ఠించారు. డప్పుచప్పుళ్లకు శివసత్తుల పూనకాలతో సంబురాలు అంబరాన్ని అంటాయి. భక్తులు పెద్ద ఎత్తున చేరుకొని కంకవనాన్ని తాకుతూ మొక్కులు చెల్లించి కొబ్బరికాయలను కొట్టారు. కంకవనం ఆకులను తీసుకునేందుకు పోటీపడ్డారు. శుక్రవారంతో ఈ జాతర ముగుస్తుందని పూజారులు తెలిపారు. కార్యక్రమంలో వడ్డెలు వెంకనర్సయ్య, సత్యం, శ్రీను, పగిడయ్య, గోపాల్, సత్యమ్మ, గణపతి, నర్సింహారావు, విష్ణు, సతీష్, సత్యవతి పాల్గొన్నారు.



ఐలాపూర్‌లో వనం నుంచి సమ్మక్కను తీసుకొస్తున్న పూజారులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శివాలయంలో నిర్వహిస్తున్న సమ్మక్క, సారలమ్మ వన దేవతల జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం పూజారులు కంక వనం తీసుకువచ్చారు. అడవి ఉంచి మేలతాలాల నడుమ గిరిజన సంప్రదాయ పద్ధతిలో కంక వనం తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.



ఏటూరునాగారం: అడవి నుంచి కంకవనాన్ని తీసుకొస్తున్న దబ్బగట్ల వంశస్థులు, వడ్డెలు

చోరీకి యత్నం

ఎస్ఎస్ తాడ్వాయి/ ములుగు : మేడారం సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వెళ్తున్న సమయంలో పర్వతగిరి మండలం రోళ్లకల్ గ్రామానికి చెందిన పుష్పమ్మ మెడలోని పుస్తెతాడును చోరీకి చేసేందుకు దొంగ యత్నించారు. పుష్పమ్మ అప్రమత్తమై కేకలు వేయడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న సీసీఎస్ కానిస్టేబుల్ రాజ్‌కుమార్, మధు అప్రమత్తమై దొంగను పట్టుకొని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు తరలించారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

కూల్‌డ్రింక్స్ అందజేత

ములుగు : మేడారం మినీ జాతరకు వస్తున్న భక్తులకు తాగునీరు బాటిళ్ల అందించడంతో పాటు ఎండను లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు కూల్‌డ్రింక్స్ బాటిళ్లను గురువారం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, జంపన్న చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు భూక్య జంపన్న అందజేశారు. పార్టీ కార్యకర్తలు రాత్రి, పగలు తేడా లేకుండా భక్తులకు అవసరమైన సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దుండగుల మల్లయ్య, నార్లాపురం మాజీ సర్పంచ్ సిద్దబోయిన చిన్నక్కశివరాజ్, రతన్‌సింగ్, లక్ష్మి, సమ్మయ్య, మధుసూదన్ పాల్గొన్నారు.

కోయా రే కోయి కోయి కోయా..

జాతరలో డ్యాన్స్ చేస్తున్న యువత

గోవిందరావుపేట: మేడారం జాతరలో అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్న అనంతరం భక్తులు సమీప అడవిలో వంటలు చేసుకుని మద్యం సేవిస్తూ సరదాగా వివిధ పాటలకు డ్యాన్స్‌లు చేస్తూ ఎంజాయ్ చేస్తారు. ఈ క్రమంలో ఇటీవల సోషల్ మీడియాలో వైరలైన కోయారే కోయి కోయి కోయా.. మామారే సంద మామ.. కోయి కోయి కొన్ని కోయి.. అనే పాటకు డ్యాన్ చేస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. డీజే మిక్స్ చేసి రిలీజ్ చేసిన ఈ పాటకు యువతీయువకులు, మహిళలు, పిల్లలు, వృద్ధులు నృత్యాలు చేస్తూ సందడి చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

- 300 క్వింటాళ్ల 60 కిలోల బియ్యం స్వాధీనం

గోవిందరావుపేట: అక్రమంగా తరలిస్తున్న 300 క్వింటాళ్ల 60 కేజీల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్టు పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మొద్దులగూడెంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా లారీ నంబర్ ఏపీ 24 టీసీ 1619లో గోధుమ రంగు బస్తాలతో నిండి ఉండగా అనుమానాస్పదంగా కనిపించడంతో లారీ డ్రైవర్‌ని అదుపులోకి తీసుకొని అడుగగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్నామని తెలిపినట్లు తెలిపారు. దీంతో వెంటనే డ్రైవర్‌ను వివరాలు అడిగి తెలుసుకోగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జగ్గయ్యపేట అని అల్లూరు శ్రీను అని తెలిపారు. లారీలో ఉన్న బియ్యం మంగళగూడేనికి చెందిన నర్రా పెద్దులువని మహబూబాద్ చుట్టు పక్కలా గ్రామాల నుంచి తక్కువ ధరకు కొని మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఎక్కువ ధరకు అమ్ముతాడని తెలిపినట్లు పేర్కొన్నారు. వాటి విలువ సుమారుగా రూ.6 లక్షల 12 వందలు ఉంటుందని తెలిపారు. వెంటనే వాటిని స్వాధీన పరుచుకోని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కమలాకర్ తెలిపారు.



పట్టుకున్న బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

16న ‘రచ్చబండ’

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో ఈ నెల 16న నిర్వహించే మున్నూరు కాపు రచ్చబండ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భద్రాచలం మున్నూరు కాపు సంఘం నియోజకవర్గ కోఆర్డినేటర్ ధనపనేని వెంకటేశ్వర్లు పటేల్ కోరారు. గురువారం మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం సమావేశాన్ని నిర్వహించారు. జక్కుల శ్యామ్, పడాల రమేశ్, కూసం సాంబం, రమేష్ ఉన్నారు.

క్వింటాకు రూ.25 వేలు ఇవ్వాలి

వెంకటాపురం(కె): మిర్చికి క్వింటాకు రూ.25 వేలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఆలుబాక గ్రామంలో గురువారం గ్రామ పంచాయతీ స్థాయి జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిర్చిని సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పంటకు నల్ల తామర పురుగుల వలన పంటకు నష్టం జరిగిందన్నారు. అలాగే గిట్టుబాటు ధర లేక పోవడంతో ఆర్థికంగా కుంగి పోతున్నారన్నారు. ఈ సమావేశంలో ఇరుప శ్రీను, గ్యానంవాను, నర్సింహారావు, కృష్ణ, వీర వేణి, కృష్ణ, రాంబాబు, చందర్ రావు, మల్లయ్య, రాము తదితరులు ఉన్నారు.

శిక్షణ తరగతులపై పర్యవేక్షణ

ములుగు రూరల్: ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులకు ఇంగ్లిష్‌పై శిక్షణ తరగతులను దిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ వారి సహకారంతో నిర్వహింస్తున్నారు. మేరకు గురువారం ఈసీఐఎల్ బృందం సభ్యులు ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. దిశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించిన ఇంగ్లిష్ బోధన మెలకువలు, ప్రోత్సాహ కార్యక్రమాలను ఈసీఐఎల్ బృందం చైర్మన్ మురళీధర్, జనరల్ మేనేజర్ వేణుబాబు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ దుర్గాప్రసాద్ పర్యవేక్షించారు. జిల్లాలో మండలానికి ఆరు ప్రాథమిక పాఠశాలల చొప్పున 54 పాఠశాలలో ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. దిశా ఫౌండేషన్ ప్రతినిధులు ఐశ్వర్య, డీఎంహెచ్ఓ గోపాల్‌రావు, సమగ్రశిక్షా కోఆర్డినేటర్ అర్షం రాజు, గుల్లపెల్లి సాంబయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు

ములుగు రూరల్: అటవి జంతువుల నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన అదిగొప్పుల చంద్రమౌళిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల రక్షణకు బైండింగ్ వైర్‌లు అమర్చి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంతో తెలియకుండా అటువైపు వెళ్తున్న వారు ప్రమాదాలకు గురై మృతి చెందుతున్నారని అన్నారు. అబ్బాపూర్ సమీపంలో పంట చేనుకు రక్షణకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చినట్లు వచ్చిన సమాచారం మేరకు వెళ్లి పరిశీలించి ఎలక్ట్రీషియన్‌తో విద్యుత్ సరఫరా నిలిపి వేసిశామని తెలిపారు. ఈ విద్యుత్ తీగలు అమర్చిన చంద్రమౌళిని ఎలక్ట్రిసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశామని అన్నారు. పంటలకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చిన వారి సమాచారం అందిస్తే రూ.5 వేలు బహుమతిగా అందిస్తామని తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- మండల వైద్యాధికారి మధుకర్

వాజేడు: వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి మధుకర్ అన్నారు. మండల పరిధిలోని బాలికల మినీ గురుకులం, కేజీబీవీ వసతి గృహాల్లో గురువారం మధుకర్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు లెప్రసీపై అవగాహన కల్పించారు. స్పర్శ లేని, గోధుమ రంగులో మచ్చలు ఉన్న వారు వైద్య పరీక్షలను చేయించుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే వసతి గృహాల్లోని వంటలను పరిశీలించారు. అనంతరం దగ్గు, జలుబు, జ్వరం ఉన్న వారికి వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వరరావు, కోటిరెడ్డి, చిన్న వెమ్కటేశ్వర్లు, లఖాన్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

- ప్రిన్సిపాల్ ఈట రేణుక

ఏటూరునాగారం: మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఈట రేణుక అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సరోజినీ నాయుడు జయంతి దినోత్సవాన్ని పురస్కరించుకొని ‘జాతీయ మహిళా దినోత్సవ’ కార్యక్రమంను కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అధ్యాపక బృందం సరోజినీ నాయుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సరోజినీ నాయుడు గొప్పతనమును, మహిళల విద్యా సమీకృత అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, అప్పుడే విజయాలు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కన్వీనర్ కనీస్ ఫాతిమా, వెంకటయ్య, జ్యోతి, జీవవేణి, మున్ని, సుమలత, భావన, సంపత్, రమేష్, భాస్కర్, అభిలాష్, శేఖర్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అధ్యాపక బృందం

సరోజినీదేవి జయంతి వేడుకలు

మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ పాఠశాలలో సరోజినీదేవి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రత్యేక అధికారిని అరుణ సరోజినీదేవి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హరిత, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

అడవులను రక్షించుకుందాం..



అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఎస్ఓ నాగమణి

- ఎఫ్ఎస్ఓ మల్ల నాగమణి

వాజేడు: అడవులను రక్షించుకుందామని ఎఫ్ఎస్ఓ మల్ల నాగమణి అన్నారు. మండల పరిధిలోని పూసూరులో గురువారం గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అడవులను కాపాడుకోవాల్సిన అవసరం మనకు ఎంతైనా ఉందన్నారు. అడవుల మూ లంగానే ఆక్సిజన్ లభిస్తుందని, జంతువులు జీవిస్తున్నాయని, సకాలంలో వర్షాలు కురవడానికి కూడా అడవులే కారణమన్నారు. అడవుల్లో నిప్పు పెట్టడం వలన అడవులు అంతరించి పోవడమే కాకుండా జీవ రాశులకు నిలువ నీడ, ఆహారం లేకుండా పోతుందన్నారు.

ప్రతీ వస్తువు సెపరేటు

టెండర్లు నిర్వహించకపోయినా ధరలకు రెక్కలు

- రెట్టింపు ధరలతో అమ్మకాలు
- అధికార యంత్రాంగం తీరుపై భక్తుల అసహనం

ములుగు/గోవిందరావుపేట: మినీ మేడారం జాతరలో ఏది ముట్టుకుందామన్నా.. ఏది తిందామన్నా రేట్లు మండిపోతున్నాయి. 2024లో జరిగిన మహాజాతరతో పోలిస్తే ఈ సారి చిరువ్యాపారులు అధిక రేట్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ఉన్న ఎమ్మార్పీ రేటు బదులు రెట్టింపు ధరతో అమ్ముతున్నారని, ఇదేంటని అడిగితే తీసుకుంటే తీసుకోండి లేకపోతే మీ ఇష్టం అన్న చందాన సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇష్టారాజ్యంగా ధరలను వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

టెండర్లు లేకుండానే ఇంత రేటా..

మహాజాతర సమయంలో ప్రతి వస్తువు విక్రయానికి కాంట్రాక్ట్ పద్ధతిన అప్పగించేందుకు ప్రధాన సామగ్రి అయిన బెల్లం, కోళ్లు, వైన్స్, పసుపు–కుంకుమలు, కొబ్బరికాయలకు నిబంధనల మేరకు టెండర్లు నిర్వహిస్తారు. టెండర్ ద్వారా ప్రభుత్వానికి కొంత మేర ఆదాయం చేకూరడంతో వ్యాపారులు అధిక ధరలు వసూలు చేసినా భక్తులు ఎక్కువగా పట్టించుకోరు. మినీ జాతరలో వస్తువుల విక్రయానికి టెండర్లు జరగనప్పటికీ గతేడాది కంటే ఎక్కువగా ధరలను వసూలు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. జాతరలో ఎమ్మార్పీ ధరలకు రెట్టింపు ధరలతో విక్రయాలు చేస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంపై భక్తులు అసహనం వ్యక్తంచేస్తున్నారు.

అపరిశుభ్రంగా తలనీలాల సమర్పణ ప్రాంతం


మినీ జాతరలో అక్కడక్కడా మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. దీనికి తోడు జంపన్నవాగుపై భక్తులు తలనీలాల సమర్పణ ప్రాంతాల్లో బ్లేడ్ పత్తులు, వెంట్రుకలతో వాతావరణం అపరిశుభ్రంగా మారింది. పంచాయతీరాజ్ శాఖ తరఫున శానిటేషన్‌పై చర్యలు తీసుకుంటున్నప్పటికీ అక్కడక్కడా నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని భక్తులు చెబుతున్నారు.



మేదారంలోని దుకాణాలు

వస్తువు	సాధారణ ధర (రూ..)	వసూలు చేస్తున్న ధర (రూ..)
సంతూర్ సబ్బు	10	15
షాంపు ప్యాకెట్	01	02
కొబ్బరికాయ	30	50
లైట్ బీరు	190	260
వాటర్ బాటిల్	20	40
పావుకిలో బెల్లం	25	50
పసుపు, కుంకుమ ప్యాకెట్	02	10
టూత్‌పేస్ట్	10	20
ప్లేట్ పూరి	35	50

రేట్లు ఎక్కువగా ఉన్నాయి..




ప్రతీ సారి మేడారం మహాజాతరతో పాటు మినీ జాతరకు వస్తాం. గత మహాజాతర కంటే ఈ సారి మినీజాతరలో అన్ని వస్తువుల రేట్లు ఎక్కువగా ఉన్నాయి. రూ.20 ఉన్న వాటర్ బాటిల్‌ను రూ.40కి అమ్ముతున్నారు. పది రూపాయల టూత్ పేస్ట్ 20 రూపాయలకు అమ్ముతున్నారు. రేట్ల విషయం అడిగితే కొంటే కొనండి లేకపోతే లేదని దబాయిస్తున్నారు.

\- మధు, మంచిర్యాల

అధికారులు ప్రచారం చేస్తున్నట్లు సౌకర్యాలు లేవు..

మేడారం మినీ జాతర్లపై అధికార యంత్రాంగం చేసిన ప్రచారానికి అనుగుణంగా సౌకర్యాలు లేవు. ఏ వస్తువు కొందామన్నా రెట్టింపు ధరలు వసూలు చేస్తున్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా లేవు. తలనీలాలు సమర్పించే ప్రాంతంలో బ్లేడ్ ముక్కలు పడి ఉన్నాయి. ఎవరిని అడగాలే తెలియని పరిస్థితి నెలకొంది. అమ్మవారిని దర్శించుకొని ప్రశాంత వాతావరణంలో గడుపుదామని వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు చేయాలి.



\- సురేష్, గోదావరిఖని

అభ్యంతరాలు ఉంటే తెలపాలి

ఏటూరునాగారం: పోలింగ్ బూత్‌లపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని మండల ప్రత్యేక అధికారి, సివిల్ సప్లయ్ రాంపతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ముసాయిదా, పోలింగ్‌బూత్‌ల విషయంపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ బూత్‌ల వారిగా ఓటర్ల జాబితా, ఇతర సమాచారం ప్రదర్శించినట్లు తెలిపారు. ఓటర్లు లిస్టు, పోలింగ్ బూత్‌లపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు.



మాట్లాడుతున్న రాంపతి